


ఎంబాసిడర్ కారు ఓ సన్నని సందులో ఆగింది. ఆ సందు గలీజుగా ఉంది. కారు ఆగిన చోట రోడ్డు పక్కగా ఓ పెంటకుప్ప ఉంది. దాని మీద ఊర కుక్కలు పొర్లాడుతున్నాయి. ఆ కారులో కూర్చున్న ముగ్గురూ పెద్ద హోదాల వాళ్లే.

ఆ యిరుకు సందూ, వాసనా భరించలేక ముక్కు మూసుకూర్చున్నారు. యింతలో ఎవరో గోడ వెనక నుంచి ఎంగిలి విస్తరాకు పెంటకుప్ప మీదకి విసిరారు. ఒక్కసారి కుక్కలు పోటీలు పడుతూ కయ్, కయ్ మంటూ దాని మీద పడ్డాయి. ఆఎంగిలి మెతుకులకోసం ఒకదాన్నొకటి కరుచుకున్నాయి. విస్తరాకు చీరి చెల్లా చెదురు చేశాయి. వాటి తొక్కిసలాటతో పెంటకుప్ప చెదిరి వాసన మరింత విజృంభించింది. కారులో కూర్చున్న మేనేజింగ్ డైరెక్టరు, ధర్మారావు సహనం నశించి, విసుక్కున్నాడు, "యీ నాగరాజు మనల్నిక్కడ పడేసి ఎంతకీ రాడేమిటీ? యీ కుక్కల గోల భరించ లేకుండా ఉన్నాం."

కంపెనీ యింజనీర్ రంగారావు మరింత కోపంగా అన్నాడు, "అసలీ కుక్కల్ని కాల్చి పారేయ్యాలి. నాలుగు మెతుకుల కోసం కొట్టుకు చస్తున్నాయి. ఛీ! వెధవ జాతి."

యింతలో నాగరాజు ఓ మూల నుంచి హడావుడిగా వచ్చి కారులో ముందు సీటులో కూర్చుని డ్రైవరు రాంబాబుతో 'పోనియ్!' అన్నాడు నాగరాజు చేతిలో సూట్‌కేసుంది.

"ఏమయ్యా, మమ్మల్నిలా పెంటకుప్ప మీద పడేసి ఎక్కడికి పోయావ్?" అన్నాడు కోపంగా నాగరాజు. ఆలస్యానికి క్షమాపణలు చెప్పకుని. " మనల్ని ఎవరో కనిపెడుతున్నారని అనుమాన మొచ్చి, దారి మార్చి రావడంలో ఆలస్యమైంది." అని డ్రైవరుతో 'గెస్ట్ హౌస్‌కు పోనియ్' అన్నాడు. రాంబాబు యీమధ్యనే నాగరాజు డ్రైవర్‌గా చేరాడు.

గెస్టు హౌసులో నాగరాజు, కావలిసిన ఏర్పాట్లన్నీ ముందే చేసి ఉంచాడు. మరికొద్ది క్షణాల్లో అందరూ సోఫాలలో కూర్చుని, విస్కీ సేవిస్తూ, చికెన్ ఫ్రైలు కొరుకుతూ నాగరాజు చేసిన ఏర్పాట్లు మెచ్చుకున్నారు. నాగరాజు చెప్పిన ప్రకారం రాంబాబు గది ముందర కాపలా ఉన్నాడు. సమయం చూసి నాగరాజు లోపల కొచ్చి, సూట్‌కేసు తెరచి బల్ల మీద పెట్టాడు. "యివిగో మూడు లక్షలు అన్న ప్రకారం నా మాట నెరవేర్చుకున్నాను. యిక మీరు చూసుకోండి" అని బయటకు వెళ్ళాడు. 'ఆనెస్ట్ ఫెలో' అని మెచ్చు కున్నాడు ధర్మారావు సంతృప్తిగా నవ్వుకుని.

ధర్మారావు గొంతు సవరించుకునీ చెప్పాడు. "ఫ్రెండ్స్ అసలుమన ప్లాంట్ ఎక్స్‌పాన్షన్ కి, స్కీము వేసి యిదంతా నడిపించి నేను. అసలిప్పుడున్న ప్లాంట్ కపాసిటీ యే ఫుల్‌గా ఉపయోగించుకోలేక పోతున్నాం. అయినా ఓ పెద్ద స్కీము అప్రూవ్ చేయించాను. అందువలన, యిందులో నేను సగం వాటా కోరుకోడం ఉచితమని నా భావం" రంగారావు నిరుత్సాహపడి అన్నాడు. "బాస్, మీరు నాకు న్యాయం చేయాలి. నాగరాజు సప్లై చేస్తున్న మేటిరియల్ అంతా సబ్ స్టాండర్డ్. అదంతా యింజనీర్‌గా సర్టిఫై చేస్తున్నది నేను. రేపేదైనా వస్తే ముందర తెగిపడేది నా తల! నా రిస్క్ ఆలోచించారా? నాకే సగం యిచ్చి, మీ రిద్దరూ మిగతా సగం పంచుకోండి"

అంత వరకు మౌనంగా ఉన్న సుబ్బరామన్ అదోలా నవ్వి అన్నాడు. " బ్రదర్స్, అందరం సమానంగా పంచుకుందాం. ఎవరెంత చేశారూ అంటే నా పాత్ర చాలా ఉంది. మీది క్వాజై గవర్నమెంట్ కన్సర్న్. చివరికి మీ ఫైల్సు మా ఆఫీసుకి రావాలి. నేను సెక్రటరీగా మినిష్టరు చేత నోట్ పుటప్ చేయించాలి. యిది మీరనుకున్నంత సులభం కాదు. అసలు, మంత్రికే అనుమానమొస్తే, యీ మూడు లక్షలూ, మరో మూడు కలిపి వాడే లాగేస్తాడు. ఏదో వాడు నిశానీ గాడు కనుక మేనేజ్ చేశాను. కనుక, వివాదాలొద్దు. లెటజ్ స్ప్లిట్ యీక్వల్లీ" యీ సూచన ధర్మారావుకి నచ్చలేదు. కోపంగా గ్లాసులో విస్కీ మింగి అన్నాడు.

"చూడండి, నేను ఎమ్.డి.గా యీ స్కీమంతా కాన్సెల్ చేయించగలను. మరచిపోకండి. నా కివ్వవలసిన వాటా నా కివ్వండి. యిదేం ముష్టి కాదు. న్యాయంగా నాకు రావలసింది."

సుబ్బరామన్, మరో గుక్కెడు మింగి అన్నాడు. "ధర్మాజీ, తొందర పడకండి. అసలు మంత్రి గారితో చెప్పి, యీ కార్పొరేషన్ సిక్ యూనిట్ అని రద్దు చేయించగలను. నన్ను తక్కువ అంచనా వేయకండి!" ధర్మారావుకి ముందు ఊపు ఎక్కువైంది.. కోపంతో పళ్లు బిగించి అన్నాడు " మీరిద్దరూ నన్ను ద్రోహం చెయ్యాలని చూస్తున్నారా?" రంగారావన్నాడు "సారీ బాస్, మీరు ఉద్రేక పడకండి. యిందులో ఏ ఒక్కరం అంతా నా వల్లనే జరిగిందనలేము. ముం ముందు చాలా ఉంటాయి. యిలాగే సర్దుకు పోవాలి." ధర్మారావు అంగీకరించలేదు. అతను ఆవేశంతో ఊగిపోయాడు. "నో! అంతా మోసం. నేను కంట్రాక్టు కాన్సిల్ చేసేస్తాను" అని అరిచాడు. హఠాత్తుగా వివాదం పెరిగి పోయింది. ఒకరి నొకరు కాలరు పట్టుకునే స్థితికి వచ్చింది. రాంబాబు భయపడి వెళ్ళి నాగరాజుని పిలుకుకొచ్చాడు. నాగరాజు వచ్చి తెలివిగా సర్దుబాటు చేశాడు. అతను చెప్పినట్లు వినడం అందరికీ లాభ మనిపించింది.

కారు తిరుగు ప్రయాణం సాగించింది. వెనక సీట్లో ముగ్గురూ బిగుసుకుపోయి కూర్చున్నారు. కారు మళ్లీ అదే యిరుకు సందు ప్రవేశించింది. అదే పెంట కుప్ప దగ్గర ఆగింది. నాగరాజు దిగి వెళ్లిపోయాడు. అప్పుడే విసిరిన మరో ఎంగిలాకు మీదకు మళ్లీ ఎగ బడ్డాయి కుక్కలు.

రాంబాబు కిదంతా కొత్త. కారు స్టార్ట్ చేస్తూ, అప్రయత్నంగా 'ఛీ, కుక్కలు' అని చీదరించుకున్నాడు. రంగారావు బయటకు చూస్తూ, "ఛీ, యీ కుక్కలింకా అలాగే కొట్టుకు చస్తున్నాయి. వాటి బతుకే అంత!" అన్నాడు.

కారు ముందుకు సాగింది. కాని రాంబాబు మనసులో మెదిలిన 'కుక్కలు' అవి కాదు!

♦